సాక్షి
అనంతపురం
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



పట్టుదలతో విజయపథం
ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పోటీ పరీక్షల్లో సత్తా చాటిన పలువురు ఎస్‌ఐ పోస్టులకు ఎంపికయ్యారు. 8లో



కిలో టమాట రూ.17
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.9, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.4°/16.1°
జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

వెయ్యేళ్లు వర్ధిల్లు నాయకా

- ఘనంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు
- సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటిన నాయకులు, అభిమానులు
- మిన్నంటిన 'జయహో జగన్' నినాదం

అభిమానం.. ఆకాశాన్నంటింది. జయహో జగన్ నినాదాలతో హోరెత్తించింది. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటింది. జననేత చిత్రపటాలపై క్షీరాభిషేకాలు కురిపించింది. విప్లవాత్మక పథకాలు కొనసాగించాలని ఆకాంక్షించింది. వెయ్యేళ్లు వర్ధిల్లు నాయకా అంటూ సంక్షేమ సారథిని మనసారా ఆశీర్వదించింది. చల్లగా దీవించమంటూ దేవుడిని ప్రార్థించింది.



అనంతపురంలో భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి. చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు



రాయదుర్గంలో పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అధినేత పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున రక్తదాన, అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలు చేపట్టారు.

- అనంతపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేశారు. జెడ్పీ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వజనాస్పత్రిలో 1,100 మంది రోగులకు పాలు, బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ విప్లవంతో అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.
- దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో ఎమ్మెల్యే కాపు ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఏరియా ఆస్పత్రిలో రక్తదాన, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో యువత రక్తదానం చేశారు. మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కాపు భారతి పాల్గొన్నారు. అలాగే, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టుగోవింద రెడ్డి నివాసంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 250 మంది రక్తదానం చేసి సీఎంపై అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- గుంతకల్లు, గుత్తిలోని పార్టీ కార్యాలయాల్లో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. గుంతకల్లు ఏరియా ఆస్పత్రిలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. పామిడిలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు ఆధ్వర్యంలో 700 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.
- ఎస్కే యూనివర్సిటీ వద్ద ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. సంక్షేమ సారథికి మళ్లీ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.
- ఉరవకొండలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి నివాళులర్పించారు.
- కళ్యాణదుర్గంలోని పార్టీ కార్యాలయంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జయహో జగన్ అంటూ నినాదాలు చేశారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సర్వోత్తమ, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రక్తదాతలకు పండ్లు, జ్యూస్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి



గుంతకల్లులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి



ఉరవకొండలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న విశ్వ

• 430 మంది రక్తదానం



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు శింగనమల నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో రోటరీపురంలోని ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 430 మంది రక్తదానం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, మాజీ ఎమ్మెల్యే యామినిబాల ఉన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో డీఈఓ నాగరాజు, ఇతర అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి ఏపీని దేశానికే ఆదర్శంగా నిలిపారని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వి.నాగరాజు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. సీఎం జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. స్థానిక రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22,640 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. గతేడాది విద్యార్థులు, 8వ తరగతి బోధించే టీచర్లకు కలిపి మొత్తం 25,640 ట్యాబ్‌లు అందజేశామన్నారు. రెండేళ్లలో ట్యాబ్‌ల కోసమే రూ.159.32 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. డిజిటల్ విద్యా విధానం అమలులో మన రాష్ట్రం దేశానికే దిక్సూచిలా నిలిచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదింటి పిల్లలను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బైజూస్ కంటెంట్ కల్గిన ట్యాబ్‌లు విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్, ఇంగ్లిష్, టోఫెల్‌పై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఏఐ టెక్నాలజీతో డౌట్ క్లియరెన్స్ అప్లికేషన్ కూడా ఇచ్చారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్యాబ్‌ల పంపిణీ ప్రారంభ కార్యక్రమాన్ని ఐఎఫ్‌పీ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఎంఈఓ వెంకటస్వామి, పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి, బైజూస్ ట్యాబ్‌ల నోడల్ అధికారి ఓబుళరెడ్డి, సీఎంఓ గోపాలకృష్ణయ్య, అలెస్కో గోవిందరెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓలు మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై పటిష్ట నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గ్రామాలపై పటిష్ట నిఘా ఉంచాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. గురువారం ఆయన పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన గ్రామాల్లో చిన్న సమస్య చోటుచేసుకున్నా తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం

పామిడి: పట్టణ పోలీసుస్టేషన్ లోపల, బయట అపరిశుభ్రత నెలకొని ఉండడంపై ఎస్పీ అన్బురాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ బయట ప్లాస్టిక్ కవర్లు పడి ఉండడం, లోపల గదుల్లో బూజు పట్టి ఉండడం, ఎస్‌ఐ, ఇతరత్రా గదులు తాళం వేసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లాకప్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వలి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 'డయల్ యువర్ ఆర్‌ఎం' నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225847 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్

అనంతపురం అర్బన్: కలెక్టర్ గౌతమి కేంద్ర ఎన్నికల సంఘం సమావేశాల్లో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లారు. శుక్ర, శనివారాల్లో కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల సంఘం నిర్వహించనున్న సమావేశంలో ఆమె పాల్గొననున్నారు. తిరిగి ఆమె ఈనెల 24న జిల్లాకు చేరుకుంటారు. అప్పటి వరకూ జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

తొమ్మిది మంది డిబార్

అనంతపురం: ఎస్కేయూ యూజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ చేస్తున్న 9 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో నలుగురు, కళ్యాణదుర్గంలో ఒకరు, కదిరిలో నలుగురు, గోరంట్లలో ఒకరిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక


శశికళ


నందు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు నందు, శశికళ... త్వరలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో తమ పాఠశాల విద్యార్థులు చోటు దక్కించుకోవడంపై ఆ పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సరుకుల పంపిణీ సక్రమంగా జరగాలి

- అధికారులు, వలంటీర్లకు జేసీ ఆదేశం


సరుకుల పంపిణీపై సూచనలిస్తున్న జేసీ కేతన్ గార్గ్ (చిత్రంలో) డీఎస్ఓ శోభారాణి

అనంతపురం అర్బన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా చేపట్టిన నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా జరగాలని, ఎలాంటి తప్పిదాలకు పాల్పడినా చర్యలు తప్పవని సంబంధిత అధికారులు, వలంటీర్లను జేసీ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. గురువారం అనంతపురంలోని ఐదో రోడ్డులో ఏఈపీడీఎస్ యాప్ ద్వారా వలంటీర్లు నిర్వహిస్తున్న డెజిగ్నేటెడ్ ప్రాంతాల అప్‌డేట్ ప్రక్రియ జేసీ పరిశీలించి, మాట్లాడారు. ఏఈపీడీఎస్ యాప్ ద్వారా డెజిగ్నేటెడ్ ప్రాంతాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మరో రెండో రోజుల్లో పూర్తి చేయాలయిన జిల్లాలోని వలంటీర్లందరినీ ఆదేశించినట్లు తెలిపారు. ఎండీయూ వాహనాలు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రేషన్ సక్రమంగా పంపిణీ చేసేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ శోభారాణి, తహసీల్దారు బాలకిషన్, సీఎస్‌డీటీ దుర్గాప్రసాద్, సచివాలయ వీఆర్ఓ, వలంటీర్లు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయపథం

- ఆత్మస్థైర్యంతో పోటీ పరీక్షలకు సిద్ధం
- ఫలితాల్లో అగ్రస్థానం
- ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన పేదింటి కుసుమాలు

'ప్రయత్నిస్తుండాలేగాని ఎంతటి కష్టతరమైన ఉద్యోగమైనా వచ్చితీరుతుంది. గట్టిగా అనుకుంటే... లోలోపల ఆశయం రగులుకుంటే... వీధి దీపాల కింద చదువుకునైనా విశ్వవిజేత కావొచ్చు. పెద్దోళ్లకే అందలం అనే మాట వెనుకటిది. బీదాబిక్కీ సైతం ఊహించని ఎత్తుకు ఎదుగుతున్న కాలమిది. కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకోండి' అంటూ మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం చేసిన ఉద్బోధతో ప్రభావితమైన ఉమ్మడి జిల్లాకు చెందిన యువత.. తమ సత్తా ఏమిటో చాటింది. ఇటీవల ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఊహించని విధంగా ర్యాంకులు దక్కించుకున్న పలువురు ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించారు.

లైబ్రరీలో చదివి...



కళ్యాణదుర్గం: స్థానిక పార్వతీనగర్‌కు చెందిన కవిత, దేవదాసు దంపతుల రెండో కుమారుడు గౌతమ్‌సాయి అనంతపురంలోని జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌పై మక్కువతో యూపీఎస్సీ పరీక్ష రాశారు. అనంతరం గ్రూప్ 1 పరీక్షల్లో మెయిన్స్ వరకూ వెళ్లారు. అక్కడితో నిరుత్సాహపడకుండా అనంతపురంలోని పోలీస్ లైబ్రరీకెళ్లి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ వచ్చారు. ఈ క్రమంలోనే ఎస్ఐ పోస్టును దక్కించుకున్నారు. విషయం తెలియగానే ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. తన వద్ద పీఏగా పనిచేస్తున్న దేవదాసు కుమారుడు ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించారన్న విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ ప్రత్యేకంగా గౌతమ్‌సాయికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

పేదింట ఆనందాల హరివిల్లు



కంబదూరు: మండలంలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన అరుణాచలం ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించాడు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న ఎరికుల దురగప్ప, రత్నమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో చిన్న కుమారుడు అరుణాచలం... ఆర్డీటీ సహకారంతో బీటెక్ పూర్తి చేశాడు. ఆపన్నులకు అండగా నిలవాలని భావించిన అరుణాచలం ఎలాగైనా ఎస్ఐ ఉద్యోగం సాధించాలని పరితపించాడు. ఈ క్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధమై పరీక్ష రాశాడు. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. 222 మార్కులతో సివిల్ ఎస్ఐగా తాను కలలు కన్న ఉద్యోగానికి అర్హత సాధించాడు. పట్టుదలే తమ కుమారుడిని ఉన్నత స్థానానికి చేర్చిందంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్యమే నడిపించింది



బ్రహ్మసముద్రం : చదువులే జీవిత గమనాన్ని మారుస్తాయన్న తల్లిదండ్రులు మాటలు స్ఫూర్తినిచ్చాయి. దీంతో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన ఆమెను ఎస్ఐగా అర్హత సాధించేలా చేసింది. బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లికి చెందిన కురుబ భూలక్ష్మి, వన్నారెడ్డి దంపతులు చదువుసంధ్యలకు నోచుకోలేదు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం తప్ప మరే పని తెలియదు. తమ కష్టం తమ కుమార్తె జ్యోతి పడకూడదని భావించిన వారు ఆమెను చదువుల వైపు దృష్టి సారించేలా చేశారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం చిన్నాన్న మల్లేష్ చొరవతో పోటీ పరీక్షలకు హైదరాబాద్‌లో ఆరు నెలల పాటు కోచింగ్ తీసుకుంది. ఆ సమయంలోనే తండ్రి వన్నారెడ్డి అనారోగ్యం బారినపడ్డాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో తన తల్లిదండ్రులు అన్న మాటలు గుర్తుకు చేసుకుంది. 'కష్టాలు ఎన్ని ఉన్నా... లక్ష్యం వైపే గురి ఉండాలి. అప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం' అన్న ఆ మాటలే ఆమెను ఎస్ఐ పోటీ పరీక్షల్లో తలపడేలా చేసింది. ఎస్ఐ ఉద్యోగానికి జ్యోతి అర్హత సాధించడంతో నిరుపేద కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

అనుకున్నదే సాధించి



బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంటకు చెందిన దబ్బర వెంకటేశులు, కొండమ్మ దంపతుల కుమారుడు దబ్బర అనికుమార్ తిరుపతిలో ఎంబీఏ పూర్తి చేసిన తరువాత 2014లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. అయితే ఎస్ఐగా కావాలనే తపన ఆయనను స్థిరంగా ఉండనివ్వలేదు. దీంతో పోటీ పరీక్షలు రాసి తాను అనుకున్న లక్ష్యానికి చేరుకోవడంతో గ్రామస్తులు, మిత్రులు అభినందించారు.

గిరిజన ఆణిముత్యం



బెళుగుప్ప: మండలంలోని బ్రాహ్మణపల్లి తండాకు చెందిన వడిత్యా గోపాల్‌నాయక్, గీతాబాయి దంపతుల కుమారుడు వడిత్యా అశోక్‌కుమార్‌నాయక్ పోలీసు బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించారు. కళ్యాణదుర్గంలోనే డిగ్రీ వరకూ చదువుకున్న ఆయన ఎస్ఐ కావాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందారు. ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించడంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి



గుత్తి: ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి ఎదగాలనే కసి ఆమెలో పట్టుదలను పెంచింది. అదే తాను అనుకున్న లక్ష్యాన్ని చేరువ చేసింది. గుత్తి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రావణిరెడ్డి ఎస్ఐ ఉద్యోగానికి అర్హత సాధించారు. పెద్ద పప్పూరు మండలం పెద్ద యక్కలూరు గ్రామానికి చెందిన శ్రావణిరెడ్డి... 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం గుత్తిలో పోస్టింగ్ పొందారు. ఎస్ఐ కావాలనే బలమైన ఆశయం ఆమెను పోటీ పరీక్షలకు సిద్ధపడేలా చేసింది. అనుకున్నది సాధించాలనే పట్టుదలతో పోటీ పరీక్షలు రాసిన ఆమె గురువారం వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించడంతో గుత్తి పోలీసుల్లో హర్షం వ్యక్తమైంది. సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ నాగమాణిక్యం, తదితరులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

ఇది ఆరంభమే...



రాప్తాడు: వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన బాలగొండ చిన్న బాబయ్య, శివమ్మ దంపతులు తమ కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలనూ సమానంగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించారు. రెండో కుమార్తె హరిత అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకూ చదువుకుంది. 8 నుంచి ఇంటర్ వరకు ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో, ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈ క్రమంలోనే ఐఎఫ్ఎస్ సాధించాలనే తపనతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటుండగా ఆమెకు తెలియకుండా ఎస్ఐ పోటీ పరీక్షలకు నాన్న బాబయ్య దరఖాస్తు చేశాడు. ఈ విషయాన్ని తండ్రి ద్వారా తెలుసుకున్న ఆమె ఆయన ఆశయాన్ని నెరవేరుస్తూ తొలి ప్రయత్నంలోనే ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించారు. అయితే ఇది కేవలం ఆరంభం మాత్రమేనని ఎలాగైనా ఐఎఫ్ఎస్ సాధించి తీరుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

రైతు ఇంట ఆనందం



బెళుగుప్ప: మండలంలోని రామినేపల్లికి చెందిన ఆంజనేయులు, సాలమ్మ దంపతుల కుమారుడు మంజునాథ్ చిన్నప్పటి నుంచి వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటూ వచ్చేవాడు. ఈ క్రమంలో అగ్రి ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అయితే తన చిరకాల వాంఛగా ఉన్న ఎస్ఐ ఉద్యోగం సాధించాలనే తపన అతన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా చేసింది. అనుకున్నట్లుగానే లక్ష్యాన్ని చేరకోవడంతో నిరుపేద రైతు కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రమేష్.. మంజునాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఒకే ఊళ్లో ఇద్దరు





కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన గజేంద్ర, కురుబ శ్రీవాణి ఎస్ఐ ఉద్యోగానికి అర్హత సాధించారు. గ్రామానికి చెందిన మాలమ్మ, గంజన్నకు ముగ్గురు కుమారులు కాగా, వీరిలో చివరి వాడు గజేంద్ర. కూలి పనులతో జీవనం సాగిస్తునే ఎస్ఐ రాత పరీక్షల్లో సత్తా చాటారు. అలాగే శ్రీవాణి తల్లిదండ్రులు నాగలక్ష్మి, బాలాజీ... వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. తమ గ్రామానికి చెందిన ఇద్దరూ ఎస్ఐలుగా ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మిత్రుల సహకారంతో...



బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లికి చెందిన వడ్డే వెంకటేశులు, భాగ్యమ్మ దంపతుల కుమారుడు అశోక్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే పదో తరగతి వరకూ చదువుకున్నాడు. అనంతరం ఇంజనీరింగ్ పూర్తి చేసి తన పెదనాన్న, మాజీ సర్పంచ్ తిమ్మన్న సూచన మేరకు సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మిత్రులు వెంకటేశ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, అశోక్, సిద్దేశ్వర్, లలిత్, మంథేష్ అన్నింటా సహకరిస్తూ వచ్చారు. అయితే ఊహించని విధంగా పోలీస్ బోర్డు నిర్వహించిన రాత పరీక్షల్లో విజయం సాధించి ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించారు. దీంతో కుటుంబసభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరూ ఇద్దరే


సుధీర్‌రెడ్డి


నరేష్‌యాదవ్

తాడిపత్రి: ప్రస్తుతం తిరుపతిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పెద్దవడుగూరు మండలం తెలికి గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించడంతో తల్లిదండ్రులు మద్దిలేటిరెడ్డి, సావిత్రమ్మ హర్షం వ్యక్తం చేశారు. అలాగే తాడిపత్రి మండలం యర్రగుంటపల్లికి చెందిన నరేష్‌యాదవ్ 2020లో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఈ ఏడాది తెలంగాణపోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో 5వ ర్యాంక్ సాధించి ఎస్ఐగా శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఏపీ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించి ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించడంతో తల్లిదండ్రులు లక్ష్మీనారాయణమ్మ, శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు. అలాగే నార్పల మండలం నాయనపల్లికి చెందిన లావణ్య, నార్పలకు చెందిన జగదీశ్వరరెడ్డి కూడా ఎస్ఐ పోస్టులకు ఎంపికయ్యారు.

ఓపెన్ కేటగిరిలో మూడో స్థానం



ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన చిగిచెర్ల గురుప్రసాద్, నాగరత్నమ్మ దంపతుల కుమార్తె చిగిచెర్ల లహరి... ఎస్ఐ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. 225 మార్కులతో ఓపెన్ కేటగిరి మహిళల విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్న ఆమెను గ్రామస్తులు, బంధువులు, తల్లిదండ్రులు అభినందించారు.

సీమ జోన్‌లో 7వ ర్యాంక్



బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం పంచాయతీ ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట అఖిల్‌కుమార్ వివిధ ఉద్యోగాల్లో మౌనంగానే ఎదుగుతూ వచ్చారు. లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి దంపతుల రెండో కుమారుడైన అఖిల్‌కుమార్... టెక్ మహేంద్రలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం అగళి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా.. టెక్నాలజీపై పూర్తి పట్టు ఉండడంతో డిప్యూటేషన్‌పై పుట్టపర్తిలోని సైబర్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్ఐ పోటీ పరీక్షల్లో రాయలసీమ జోన్ పరిధిలో ఏడో ర్యాంక్‌ను దక్కించుకోవడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన బెటాలియన్ స్పోర్ట్స్ మీట్


పతకాలు అందుకున్న క్రీడాకారులతో డీఐజీ వెంకటేశ్వర్లు, కమాండెంట్ గంగాధరరావు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతులూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ గురువారం నేత్రపర్వంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు రేంజ్ ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ వెంకటేశ్వర్లు హాజరై, విజేతలకు పతకాలు ప్రదానం చేసి, మాట్లాడారు. 14వ బెటాలియన్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎస్కేయూ ప్రొఫెసర్ వేణుగోపాలరావు, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ జోజిరెడ్డి, డీఎస్పీలు రమణమూర్తి, దామోదర్, ఏఓ నాగభూషణమ్మ, ఇన్‌స్పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వర్, రామారావు, కృష్ణానాయక్, బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

13 మంది మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి: పట్టణంలోని పలు ప్రదేశాల్లో మట్కా రాస్తున్న 13 మంది బీటర్లను అరెస్ట్ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రిలోని పాత కోట పార్కు, గురులాడ్జి తదితర ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తలారి బ్రహ్మనాయుడు, చైతన్య, రామకృష్ణ, మునీర్, షేక్ హాజరాబీ, ములానీ మునీరా, షేక్ షాహిదా, షబ్బీర్ బాషా, లింగుట్ల కొండమనాయుడు, హరిజన లక్ష్మీదేవి, గాలి మంగమ్మ, గాలి వాసంతి, దాష్టి సరస్వతి పట్టుబడ్డారు. వీరి నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.1,66,140 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాపం పసివాడు!


పోలీసుల సంరక్షణలో ఉన్న ధరణి

పుట్లూరు: పాపం ఓ పసివాడు.. కన్న తల్లిదండ్రుల నుంచి దూరమై ఒంటరిగా తిరుగుతుంటే చేరదీసిన పెంపుడు తండ్రికి సమస్యగా మారాడు. వివరాలు.. పుట్లూరులోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉదయం అడ్మిషన్ కోసం ఓ బాలుడిని స్థానికుడు ఎరికల శేఖర్ తీసుకెళ్లాడు. అక్కడి ఉపాధ్యాయులు ఆధార్ కార్డు ఇవ్వాలని తెలపడంతో ఆ పిల్లాడికి ఆధార్ లేదని, అనాథగా తిరుగుతుంటే చేరదీశానని అమాయకంగా సమాధానం ఇవ్వడంతో ఉపాధ్యాయులు అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిబంధనల మేరకు పిల్లాడిని దత్తత తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయులు తెలపడంతో తన కుటుంబసభ్యులతో కలసి పోలీసులను శేఖర్ ఆశ్రయించాడు. తన భార్య వెంకటేశ్వరి ప్రసవానికి అనంతపురంలోని సర్వజనాసుపత్రిలో చేర్పించినప్పుడు ఆ బాలుడు తమ వద్దకు వచ్చాడని, ఆకలితో బాధపడుతుంటే పిడికెడు అన్నం పెట్టడంతో తమనే అంటిపెట్టుకుని ఉండిపోయాడన్నారు. తల్లిదండ్రులు ఎక్కడ అని అడిగినా చెప్పలేదని, తన పేరు మాత్రం ధరణి అని చెబుతున్నాడని తెలిపారు. ఒంటరిగా వదిలేస్తే ఆకలిదప్పికలతో ఇబ్బంది పడతాడని భావించి తామే పెంచుకుందామని ఇంటికి పిలుచుకొచ్చినట్లు వివరించారు. శేఖర్ సమాచారం మేరకు వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు పిల్లాడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం విచారణ చేపట్టారు.

అధిష్టానం ఆదేశిస్తే బాబుపై పోటీకి సై

- వారిలా దొంగను కాదు... రైతు బిడ్డను
- తాడిపత్రి అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



అనంతపురం టవర్‌క్లాక్: వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయం మేరకే తాను నడుచుకుంటానని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. అవసరమైతే కుప్పంలో చంద్రబాబుపై పోటీ చేయాలని ఆదేశిస్తే శిరసావహిస్తానని స్పష్టం చేశారు. గురువారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దవడుగూరులో బుధవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలు ఖండించారు. తాను దొంగను కాదని, రైతు బిడ్డనని.. జేసీ కుటుంబంలా అవినీతి, అక్రమాలు చేసి డబ్బు పోగు చేసుకోలేదన్నారు. పెద్దవడుగూరులో రైతులు నష్టపోతే ప్రభుత్వం ద్వారా పరిహారం వచ్చేలా చేశానన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయం తన రక్తంలోనే లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో జేసీ కుటుంబం రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. గతంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేసిన పనులు, తాను అధికారంలో ఉన్న ఈ నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిపై ఎప్పుడు బహిరంగ చర్చ పెట్టినా తాను సిద్ధమేనని సవాల్ విసిరారు. మిడ్ పెన్నార్ డ్యాం ద్వారా రెండు పంటలకు నీరిచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. తాడిపత్రిలో ఈ సారి ఎన్నికల బరిలో ఎవరు నిలబడాలనే అంశంపై జేసీ కుటుంబసభ్యుల మధ్యే సందిగ్ధత నెలకొందని, మధ్యలో కాలవ శ్రీనివాసులు సమీప బంధువు దూరి పరిస్థితిని మరింత జఠిలం చేశారన్నారు. తాడిపత్రిలో ఎవరు పోటీచేసినా గెలుపు వైఎస్సార్‌సీపీదేనన్నారు.

పేదలకు 'పట్టా'భిషేకం

- పేదల సొంతింటి కల సాకారమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- ఉరవకొండలో 300 మందికి ఇంటి పట్టాల పంపిణీ
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ దేశ చరిత్రల్లోనే సువర్ణ అధ్యాయాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లిఖించారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఉరవకొండ నియోజకవర్గంలో వేలాది మందికి ఇంటి పట్టాలు అందజేసి, పక్కా గృహాలను నిర్మించి ఇస్తున్నామన్నారు. రాయంపల్లి లే ఔట్‌లో అర్హులైన 300 మంది పేదలకు గురువారం ఇంటి పట్టాల పంపిణీ అట్టహాసంగా సాగింది. సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ పట్టాల పంపిణీ చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా 32 లక్షల పక్కాల గృహాల నిర్మాణం జరుగుతోందన్నారు. ఉరవకొండలోనూ రికార్డు స్థాయిలో 3వేల మందికి ఇంటి పట్టాలు అందజేయడమే కాక, పట్టాలు పొందిన లబ్ధిదారులతో పాటు సొంత ఖాళీ స్థలం ఉన్న 21వేల మందికి సొంతింటి కల సాకారం చేస్తూ పక్కా గృహ నిర్మాణాలు మంజూరైనట్లు గుర్తు చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేస్తూ ఆరోగ్యశ్రీ పరిధిలోని రూ.25లక్షలకు పెంచడం విప్లవాత్మక నిర్ణయమన్నారు. రుణమాఫీ పేరుతో నాడు డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసగిస్తే... వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రూ.25వేల కోట్ల రుణమాఫీ చేయడమే కాక మహిళా సంఘాల బలోపేతానికి విస్తృత చర్యలు చేపట్టారన్నారు. పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ అమృతరాజ్, కార్యక్రమంలో కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పార్టీ మండల కన్వీనర్ ఓబన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఈడిగ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ షేక్షావలి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరం బాషా, మాజీ ఎంపీపీ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు


ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పలువురికి కారుణ్య నియామకాలు కల్పించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న ముత్యాలప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు ఎస్. మూర్తిప్రసాద్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. అలాగే, ఓటీపీఆర్ఐలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఏ. సుశీలమ్మ మృతి చెందగా, కుటుంబసభ్యుడు ఏ. శివ సాయి కుమార్‌కు టైపిస్టుగా అవకాశం కల్పించారు. గురువారం వారికి జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇ.అరుణాకాంతి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళీమోహన్ రావు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలు


మాట్లాడుతున్న డీడీ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: క్రమశిక్షణతో మెలిగి ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలను సాధించగలుగుతారని విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి సూచించారు. గురువారం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అనంతపురం డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరీక్షలపై ఆందోళన వీడి ఆత్మస్థైర్యంతో చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని వార్డెన్లను ఆదేశించారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం జీఆర్పీ పరిధిలోని గార్లదిన్నె సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ(50) రైలు కింద పడి గురువారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మృతురాలు ఎరుపు/పసుపు రంగు చీర ధరించింది. ఆచూకీ తెలిసిన వారు 85002 38200, 99088 37888 నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

క్లుప్తంగా

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కుంటిమద్ది- సుద్దకుంటపల్లి బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే అభివృద్ధి, సంక్షేమ పాలన అమలవుతోందని రాప్తాడు ఎంఎల్‌ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుంటిమద్ది, రామగిరి గ్రామాల్లో ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. సుద్దకుంటపల్లి గ్రామానికి రోడ్డు పనులను ప్రారంభించి, కుంటిమద్ది జెడ్పీహెచ్ఎస్‌లో జగన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ గోసి నాగార్జున, మండల కన్వీనర్ కథ్రా హనుమంతరెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, నరేంద్ర, సిద్దన్న, రాజేష్, చెన్నకేశవరెడ్డి, రామ్మూర్తి, ఓబిరెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, జనార్దన్, జయచంద్రారెడ్డి, ఎరుకుల ఆది, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన హరీష్‌యాదవ్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హరీష్ యాదవ్, డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జన్మదినాన్ని పురస్కరించుకొని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో దుప్పట్ల పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన సేవా పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ అబూసలేహ, ఐటీ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ మంజునాథ్ యాదవ్, సోషల్ మీడియా అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, నాయకులు అగిలే జనార్దన్ రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్ గురుదత్త, తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ సైన్స్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓలు నరసింహారెడ్డి

ఆత్మకూరు: జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌశల్ సైన్స్ పోటీల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ ఎనిమిదో తరగతి విద్యార్థిని భార్గవి విద్యార్థిని జిల్లా స్థాయి మొదటి స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఎంఈఓ నరసింహారెడ్డి, రామాంజనేయులు ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారులను ప్రోత్సహించాలి



బ్యానర్, ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: భగవద్గీత కంఠస్త పోటీల్లో చిన్నారులను ప్రోత్సహించాలని టీటీడీ ప్రతినిధులు కోరారు. శనివారం రానున్న గీతాజయంతి వేడుకల సందర్భంగా సాగే భగవద్గీత పోటీలు గీతాజయంతి వేడుకల బ్యానర్లను, పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ప్రముఖ సంస్కృత పండితులు కేకేఎస్ శర్మ, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు తదితరులు గీతాజయంతి వివరాలు అందించారు. స్థానిక రామచంద్రానగర్‌లోని టీటీడీ కల్యాణ మంటపంలో 23న ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్‌లో జ్ఞానమ్మ వర్ధంతి



విద్యార్థుల నాటక దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో సెయింట్ ఆన్స్ విద్యా సంస్థలను స్థాపించిన 'జ్ఞానమ్మ' 149 వర్ధంతిని గురువారం జరుపుకున్నారు. ముందుగా జ్ఞానమ్మ చిత్రపటాన్ని ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అనిలా మాట్లాడుతూ జ్ఞానమ్మ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం విద్యార్థులు నృత్య నాటక వేష ఉపన్యాసాలతో ఆకట్టుకున్నారు.

జననేత జన్మదినం.. జగమంతా సంబరం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనంత, జిల్లా అధ్యక్షుడు పైలా తదితరులు

అనంతపురం కార్పొరేషన్: పరిపాలనాదక్షుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జగమంతా జరుపుకున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహమ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ లిఖిత, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఖాజా, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్‌రెడ్డి, చింతకుంటమధు, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, రంగంపేట గోపాల్‌రెడ్డి, గౌస్‌బేగ్, బలరాం, పెన్నోబులేసు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆయన నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం జెడ్పీహెచ్ఎస్‌లో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి కేక్ కట్ చేశారు.

అత్యుత్తమ విద్యనందించడమే లక్ష్యం..

ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో అత్యుత్తమ విద్యను అందించడమే సీఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ మల్లేశ్వరమ్మ, హెచ్‌ఎం నరసింహులు, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రాయలసీమ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సూగూరు రఘునాథరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాయలసీమ బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. స్థానిక ప్రియాంక నగర్‌లోని సంఘం కార్యాలయంలో జగన్ చిత్రమాలికను సందర్శించుకున్నారు.

జనం మెచ్చిన నాయకుడు వైఎస్ జగన్

రాప్తాడురూరల్: జనం మెచ్చిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమి చైర్మన్ నదీమ్ అహమ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ కొనియాడారు. ధనుంజయయాదవ్, రాధమ్మ ఆధ్వర్యంలో గురువారం అనంతపురం రూరల్ మండలం జాకీర్ కొట్టాలులో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సందీప్‌యాదవ్, వార్డు మెంబర్లు గఫూర్, ముస్తాక్, సుకుమార్, నాయకులు ఆకుల మునిశంకరయ్య, బాలనాగిరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ ప్రయాణికుల సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గురువారం బస్టాండ్ ఆవరణలో జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థకే పెద్ద పీట వేసిన జగనన్న

ఆత్మకూరు: చరిత్రలో ఉన్నదూ లేని విధంగా విద్యా వ్యవస్థకు ముఖ్యమంత్రి జగనన్న పెద్ద పీట వేశారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. స్థానిక కేజీబీవీలో తోపుదుర్తి నయనతారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ సుశీలమ్మ, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఈశ్వరరెడ్డి, నాగరాజు, గోపాల్, ప్రసాద్, ఎంఈఓలు నరిసింహారెడ్డి, రామాంజనేయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్ పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ సీఎం జగన్

అనంతపురం సిటీ: దేశం గర్వించదగ్గ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. సీఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయ ఎదుట భారీ కేక్ కట్ చేశారు. కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. మేయర్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీంఅహమ్మద్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి, బీసీ రమేశ్ గౌడ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ రిజ్వాన్, నాటక అకాడమీ మాజీ చైర్‌పర్సన్ హరిత, మహిళా విభాగం ప్రతినిధులు కృష్ణవేణి, శ్రీదేవి, నేతలు పామిడి వీరా, సోము పాల్గొన్నారు.



విమలాఫరూక్ నగర్ సర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం

పేదల పక్షపాతి వైఎస్సార్

అనంతపురం రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం సీఎం జగన్ జన్మదినం సందర్భంగా ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షుడు సాదిక్‌వలి ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీ విమలాఫరూక్ నగర్ సర్కిల్ దగ్గర వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ-4 సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, హుస్సేన్,చంద్రశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, నారాయణరెడ్డి, వెంకటరాముడు, అక్కులప్ప, వెంకటేష్‌నాయక్, రాజారత్నం, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పెద్ద ఎత్తున అన్నదానం

ఆత్మకూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం తోపుదుర్తి నయనతారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, సర్పంచులు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, మాజీ సర్పంచ్ సుశీలమ్మ, నాయకులు వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, నాగరాజు, ఈశ్వరరెడ్డి, బాబయ్య, బోయ వెంకటేష్ గోపాల్, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రసాద్, పెద్ద కొండారెడ్డి, ఈశ్వరరెడ్డి, పెద్దన్న, రామాంజి, రాము నాయక్, సచివాలయ కన్వీనర్లు ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్, మురళి, గంగాధర్, ఆంజనేయులు, పోతన్న,రాజశేఖర్, కొండా, వెంకటేష్, మహేష్,నాగరాజు, నారేంద్ర, పోలన్న, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జగన్ జన్మదిన వేడుకలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సర్వజనాస్పత్రిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని 1,100 మంది రోగులకు ఎమ్మెల్యే అనంత ఆధ్వర్యంలో పండ్లు, పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

నగరపాలక సంస్థలో సంబరాలు: నగరపాలక సంస్థ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేసి మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లకు అందించారు.

కోగటం ఆధ్వర్యంలో: డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. భారీ కేక్‌ను ఎమ్మెల్యే అనంత కట్ చేసి, పార్టీ శ్రేణులకు అందించారు.

అన్నదానం చేసిన మహాలక్ష్మి: అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి రెడ్డి, వైటీ శివారెడ్డి, నారాయణపురం మనోజ్, రంగంపేట గోపాల్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, భానుప్రకాష్, హరీష్‌రెడ్డి, దినేష్, మంజు పాల్గొన్నారు.

పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో: ఎమ్మెల్యే అనంత నివాసంలో పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి నెహెమ్యా నాగరాజు, కార్యదర్శి జీఆర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి దేవాలయంలో పూజలు: ఒకటో రోడ్డు రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అనంత, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, మేయర్ వసీం, పార్టీ అధ్యక్షుడు పైలా కృష్ణవేణి పాల్గొన్నారు.

మళ్లీ రావాలి జగన్..మన జగన్..

అనంతపురం కార్పొరేషన్: రావాలి జగన్..కావాలి జగన్..మన జగన్..మళ్లీ రావాలి జగన్..మన జగన్ అంటూ గాయనీగాయకులు పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవరణలో సంగీత విభావరి ఏర్పాటు చేశారు. రిలాక్స్ నాగరాజుతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 16 మంది గాయనీగాయకులు ప్రభుత్వ పథకాలను పాటల రూపంలో పాడారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు 1,2,3,4,5 రోడ్ల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు.

బండలాగుడు పోటీల పోస్టర్ల విడుదల: యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపురంలో జరగనున్న ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే అనంత, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆవిష్కరించారు.



విగ్రహావిష్కరణ అనంతరం కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అనంత , జిల్లా అధ్యక్షుడు పైలా, తదితరులు



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, సంబరాలు చేస్తున్న నాయకులు



ప్రయాణికురాలికి కేక్ తినిపిస్తున్న జోనల్ చైర్‌పర్సన్ మంజుల



అన్నదానం చేస్తున్న దృశ్యం

హ్యాపీ బర్త్‌డే సీఎం సార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిపారు. 51 కిలోల కేక్ కట్ చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ కృష్ణకుమారి ,వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్ర రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిప్పలూరు సుధీర్ రెడ్డి, వర్సిటీ విద్యార్థి నాయకులు హేమంత్‌కుమార్, అంకే శ్రీనివాసులు, కిరణ్, వాసు, శివ, మహేష్, తేజేశ్వర రెడ్డి, బి. జయచంద్రా రెడ్డి, రమేష్, సురేష్, నాయకులు రెడ్డివారి యో గా నంద రెడ్డి, బోధనేతర సంఘం ఎస్కేయూ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు నాగభూషణం, కవిరాజు పాల్గొన్నారు.

- వర్సిటీ సమీపంలోని అమ్మ ఒడి వృద్ధాశ్రమంలో అనంతపురం రూరల్ మండలం యూత్ కన్వీనర్ తాడిపత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పరపల్లి శివా రెడ్డి, నల్లప్ప, తేజేశ్వర్ రెడ్డి, నరేష్, పరమేశ్వర్ రెడ్డి, హేమంత్, ఆటో రామాంజి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగా రెడ్డి, అంకే శ్రీనివాసులు, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి

- ఎస్కేయూ కామర్స్ , తెలుగు విభాగం విద్యార్థులు ఆకుతోటపల్లి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో శరత్ కుమార్, ప్రశాంతి రెడ్డి, కోమల, అశోక్, బాలరాజు, రాఘవ, నాగరాజు, నరేంద్ర, నారాయణ స్వామి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు జరిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా దేవి కేక్ కట్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎల్‌ఎం. మోహన్ రెడ్డి, కార్యదర్శి పి. రమ, జిల్లా వైసీపీ నాయకులు ఎల్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్సీ బాల నరసింహా రెడ్డి, సతీష్ నారాయణ, గ్రంథాలయ సిబ్బంది వి. సుబ్బరత్నమ్మ, కమ్మన్న, రవికుమార్, శ్రీనివాసులు, రామాంజనేయులు, ప్రతాప్, కృష్ణా, ఆంజనేయులు, జయరామ్, గోవింద, బొజ్జే నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత, వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ , మేయర్ వసీం



సంక్రాంతి పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనంత, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు



రిలాక్స్ నాగరాజు ఆధ్వర్యంలో జగనన్నకు పాటలకు స్టెప్స్ వేస్తున్న కళాకారులు

సంక్షిప్త సమాచారం

నగరంలో ఊహకందని అభివృద్ధి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో గ్రూపు రాజకీయాలతో అభివృద్ధి డివైడర్లకు మాత్రమే పరిమితమైందని, వైఎస్సార్ సీపీ హయాంలో నగరంలో ఊహకందని అభివృద్ధి జరిగిందని జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 50వ డివిజన్ 72వ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జరిగింది. స్థానిక కార్పొరేటర్ శేఖర్‌బాబు, క్లస్టర్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డితో కలిసి చింతా సోమశేఖర్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఎంఎల్‌ఓ దామోదర్ రెడ్డి, నాయకులు సుజాతమ్మ, అనిల్‌కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్, నరేంద్ర, మాజీ కార్పొరేటర్ బిందుప్రియ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా సైన్స్ సెంటర్‌లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 24న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ఈనెల 24న అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో బహుమతులు ప్రదానం చేస్తారని డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి వి.నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ క్యూరేటర్ బాల మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు అజంతుల్లా, రామాంజనేయులు, ఆనంద భాస్కర రెడ్డి, అమరనాథ్, కంజుమర్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

25న దత్త జయంతి

అనంతపురం కల్చరల్: నగర శివారులోని జగద్గురు శంకర దత్తాత్రేయ మహా సంస్థానం శృంగేరి విరూపాక్ష మఠంలో ఈనెల 25న దత్త జయంతి వేడుకలు జరగనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు గురువారం తెలిపారు.

కనీస జాగ్రత్తలు తీసుకోవాలి

అనంతపురం క్రైం: బ్యాంకర్లు కనీస భద్రతా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బ్యాంకర్లతో డీఎస్పీ సమావేశమయ్యారు. డీఎస్పీ బ్యాంకర్లకు పలు సూచనలు సలహాలు చేశారు. ఏటీఎంలలో, బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేసే సమయంలో క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసు లాంటి కంపెనీల నిర్వాహకులు కూడా జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్త చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా కేంద్రంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, సీఐలు ధరణీకిషోర్, రెడ్డప్ప, ప్రతాపరెడ్డి, శివరాముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

రాప్తాడు: జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నరసింహ, అంజలి ప్రియ, ఇందు జూనియర్ త్రోబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన విషయం విదితమే. ఈ నెల 27 నుంచి 29 వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. జగన్ మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు రూ.5 వేలు చొప్పున ముగ్గురికి అందించారు.

జిల్లాకు 1,196 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: రబీ ఎరువుల ప్రణాళికలో భాగంగా డిసెంబర్ నెలవారీ కోటా మేరకు 1,166 మెట్రిక్ టన్నులు ఎరువులు జిల్లాకు చేరాయి. గురువారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్నాయి. మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సొసైటీలు అలాగే ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామని ఏడీఏ రవి తెలిపారు.

'బీఎస్-6'పై అవగాహన కలిగి ఉండాలి

అనంతపురం సెంట్రల్: కాలుష్యాన్ని నివారించడంలో భాగంగా బీఎస్-6 టెక్నాలజీతో వస్తున్న వాహనాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సిబ్బందికి జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్ ఆర్.ఆదోని సూచించారు. బీఎస్-6 టెక్నాలజీ బస్సుల నిర్వహణపై టాటా మోటర్స్ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టాటా మోటార్స్ సీనియర్ సర్వీస్ ఇంజనీరు నిశాంత్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను జేసీ కేతన్‌గార్గ్ ఆదేశించారు. నగరంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో చేపట్టిన ఆడు దాం ఆంధ్రా కార్యక్రమ ప్రారంభోత్సవ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ నెల 26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభమవుతుందన్నారు. ఆర్డీఓ గ్రంధి వెంకటేశ్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, డీఎల్‌డీఓ ఓబులమ్మ, అదనపు కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

రాప్తాడు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయిలో చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ గురువారం నిర్వహించారు. జిల్లా స్థాయికి ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి ఎం.బండమీదపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూప, జోత్స్న, సూజాత, సెయింట్ విన్సెంట్ డీ పాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు విగ్నేష్ రెడ్డి, అర్జున్, లోచనా ఎంపికయ్యారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.భాస్కర్, నాయకులు నారాయణ, రాజశేఖర్, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కోటి వేడుకల్లో పాల్గొనండి

అనంతపురం కల్చరల్: మార్గశిర మాసంలో వచ్చే పవిత్ర ముక్కోటి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని రామనగర్ శ్రీరుక్మిణి పాండురంగస్వామి ఆలయ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు తిరుపతిరావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్, ఉమామహేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఈనెల 23న తెల్లవారుజామున నుంచే ఆలయంలో నిజపాద స్పర్శ దర్శనం, ఉత్తరద్వార ప్రవేశం ఉంటాయన్నారు.